VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
శనివారం 30 మార్చి 2024
సంపుటి.01 సంచిక.236

# ఫోన్‌ట్యాపింగ్‌లో కెటిఆర్ చిప్పకూడు తినాల్సిందే

**సిగ్గులేకుండా ట్యాప్ చేశామని చెప్పడం అహంకారమే**

**వందరోజుల పాలనలో ప్రజల సమస్యలకు ప్రాధాన్యం**

**ఉద్యోగులకు ఠంచన్‌గా జీతాలు ఇస్తున్నాం**

**వాల్మీకి బోయల సమస్యలు పరిష్కరిస్తాం**

**గాంధీభవన్లో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది ఫోన్‌లు విన్నామని కేటీఆర్ అంటున్నారని, అలా చేసి ఉంటే చర్లపల్లి జైలులో చిప్పకూడు తినాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలోనే ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని.. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫిర్యాదు చేసినా అధికారులు ఎవరూ పట్టించు కోలేదన్నారు. పొరపాట్లు చేయ్యొద్దని గతంలో చెప్పినా అధికారులు వినిపించుకోకుండా ఫోన్ ట్యాపింగ్ చేశారన్నారు. తప్పులు చేసినందుకే కొందరు అధికారులు జైలుకు వెళ్లారన్నారు. కేటీఆర్ బరితెగించి మాట్లాడుతున్నారని, ఇప్పటి కైనా అహంకారం తగ్గించుకోవాలన్నారు. కుటుంబ సభ్యుల ఫోన్ కాల్స్‌ను ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమిటన్నారు. ఎవరైనా ఇతర కుటుంబ సభ్యుల కాల్స్ వింటారా అని రేవంత్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరుగుతోందన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ వందరోజుల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాము అమలు చేసిన పథకాలకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయని చెప్పారు. ఢిల్లీలో ఇతర రాష్ట్రాల నేతలను కలిసినప్పుడు తెలంగాణ గురించి చర్చించుకుంటున్నారన్నారు. వంద రోజులపాటు పూర్తిగా అభివృద్ధిపైనే దృష్టి సారించామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని తెలిపారు. మొదటి నెల 4వ తేదీన, రెండో నెల ఒకటో తేదీన జీతాలు ఇచ్చామన్నారు. ప్రజా సమస్యలపై వచ్చిన వారందరినీ కలిసి వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తన ఇంటికి వచ్చి కలుస్తున్న ప్రజల సమస్యలు విని.. పరిష్కరిస్తు న్నామన్నారు. గత ప్రభుత్వం ఓట్లు వేసిన ప్రజలను బయట పెట్టిందని ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లాలో కాంగ్రెస్‌ను ఓడించి రేవంత్ రెడ్డిని బలహీనపర్చే కుట్ర జరుగుతోందని రేవంత్ ఆరోపించారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయన్నారు. పదేళ్లుగా మోదీ ప్రధానిగా ఉండి మహబూబ్ నగర్‌కు ఏం చేశారని ప్రశ్నించారు. ఏం ముఖం పెట్టుకుని మహబూబ్ నగర్ లో బీజేపీ నేతలు ఓట్లు అడుగుతున్నారన్నారు. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వాల్మీకి బోయల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్నికల తర్వాత ప్రభుత్వంలో ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎలాంటి హామీ ఇవ్వడం లేదన్నారు. వీరంతా మంత్రి పొన్నంతో కూర్చుని సమస్యలు చర్చించాలని అన్నారు.





2లో

## కేసీఆర్ గతంలో చేసిన పాపాలే..

యాదగిరిగుట్ట పేరు మార్చడమే మొదటి తప్పు

దేవుడిపేరుతో అక్రమాలు,అ వినీతికి తెగించారు

కాళేశ్వరంలోనూ అక్రమాలు అనేకం

ఫోన్ ట్యాపింగ్ ఏ రాష్ట్రంలోనూ లేదు

మంత్రి కోమటిరెడ్డి ఘాటు విమర్శలు

## ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్

మెట్రోలో 5.28 లక్షల మంది రాకపోకలు

2లో





2లో

## పదేళ్లు పదవులు అనుభవించి దగా

కెకె, కడియంలపై కెటిఆర్ విమర్శలు

ఆ ఇద్దరూ కాళ్లు పట్టుకున్నా రానివ్వం

పార్టీలో ఉంటూనే వెన్ను పోటు పొడిచారు

పిచ్చోని లెక్క ఆ ఇద్దరినీ నమ్మాను

రంజిత్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డిలపై కెటిఆర్ విమర్శలు

# టాస్క్‌ఫోర్స్ వాహనాల్లో ఎన్నికల డబ్బు

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రోజుకో బండారం బయటపడుతోంది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి(ఎస్ఐబీ)లో సమాచార ధ్వంసంపై మొదలైన దర్యాప్తు లోతుల్లోకి వెళ్లే కొద్దీ మలుపులు తిరుగుతోంది.

**గత అసెంబ్లీ ఎన్నికల వేళ తరలింపు.. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థులకు అందజేత!**

**దర్యాప్తులో విస్తుగొలిపే విషయాలు బహిర్గతం**

**చంచల్‌గూడ జైలుకు మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావు**



**హైదరాబాద్:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రోజుకో బండారం బయటపడుతోంది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి(ఎస్ఐబీ)లో సమాచార ధ్వంసంపై మొదలైన దర్యాప్తు లోతుల్లోకి వెళ్లే కొద్దీ మలుపులు తిరుగుతోంది. తాజాగా టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావును అరెస్టు చేసి విచారించగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించి విశ్వసనీయ సమాచారం ప్రకారం.. గత ప్రభుత్వ హయాంలో టాస్క్‌ఫోర్స్‌ను తన గుప్పిట్లో ఉంచుకున్న రాధాకిషన్‌రావు సిబ్బందిని అనధికారిక కార్యకలాపాలకు వినియోగించుకున్నారు. కేసుల దర్యాప్తునకే పరిమితం కాకుండా.. ఓ ప్రధాన పార్టీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారు. ముఖ్యంగా గత నవంబరులో శాసనసభ ఎన్నికల సమయంలో ఆయన ఆగడాలు పతాకస్థాయికి చేరాయి. సదరు పార్టీకి ఆర్థిక వనరులు సమకూర్చడం కోసం తన బృందాన్ని రంగంలోకి దింపారు. ఈ క్రమంలో ఏకంగా టాస్క్‌ఫోర్స్ వాహనాల్లోనే డబ్బు తరలింపు చేపట్టారు. హైదరాబాద్ నుంచి పలు ప్రాంతాల్లోని సదరు పార్టీ అభ్యర్థులకు డబ్బు పంపడంలో రాధాకిషన్‌రావు బృందం కీలకంగా వ్యవహరించింది. పోలీసు వాహనాలైతే ఎవరికీ అనుమానం రాదనే ఉద్దేశంతో ఈ ఎత్తుగడ అమలు చేశారు. ఈ వ్యవహారంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల్లో పలువురిని ప్రస్తుతం అదుపులోకి తీసుకొని విచారిస్తుండటంతో త్వరలోనే మరికొందరి అరెస్టులు ఉంటాయని తెలుస్తోంది. మరోవైపు ఈ కేసులో ఫోన్ ట్యాపింగ్ అంశాలు ఇమిడి ఉండటంతో ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్టును చేర్చనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఆధారాల ధ్వంసం సెక్షన్లు మాత్రమే ఉండటంతో పోలీసులు ఈ దిశగా ఆలోచిస్తున్నారు.

**14 రోజుల జ్యుడిషియల్ రిమాండు**

రాధాకిషన్‌రావును సుదీర్ఘంగా విచారించిన అనంతరం శుక్రవారం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు పూర్తయ్యాక కొంపల్లిలోని న్యాయమూర్తి నివాసానికి తీసుకెళ్లగా.. 14 రోజుల జ్యుడిషియల్ రిమాండు విధించారు. దీంతో రాధాకిషన్‌రావును చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా మీడియా ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించగా నిరాకరించారు. కానీ అంతకు ముందు బంజారాహిల్స్ ఠాణా నుంచి ఆసుపత్రికి తరలించే సమయంలో మాత్రం మీడియాకు అభివాదం చేస్తూ వెళ్లారు. న్యాయమూర్తి నివాసం వద్ద ఏసీపీ వెంకటగిరి మీడియాతో మాట్లాడుతూ.. రాధాకిషన్‌రావును పోలీసు కస్టడీకి తీసుకునేందుకు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. 'రాధాకిషన్‌రావు ప్రైవేటు వ్యక్తుల ప్రొఫైళ్లు రూపొందించి అక్రమంగా పర్యవేక్షించడంతోపాటు ఎన్నికల సమయంలో అక్రమంగా నగదు తరలింపులో కీలకంగా వ్యవహరించినట్లు దర్యాప్తులో తేలింది' అని వెస్ట్ జోన్ డీసీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

**పోలీసు కస్టడీకి అదనపు ఎస్పీలు**

చంచల్‌గూడ జైల్లో జ్యుడిషియల్ రిమాండులో ఉన్న అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను హైదరాబాద్ పోలీసులు ఐదు రోజుల కస్టడీకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో జైలు నుంచి తరలించారు. తొలిరోజు వీరిని పెద్దగా విచారించలేదని తెలిసింది. మరోవైపు అదుపులోకి తీసుకున్న రాచకొండ ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు నుంచి వాంగ్మూలం తీసుకున్న అనంతరం వదిలేశారు.

**ప్రణీత్‌రావు ద్వారా ప్రత్యర్థుల కదలికలపై నిఘా**

రాధాకిషన్‌రావు బృందం ప్రధాన పార్టీ నాయకులపై పోటీచేసే ప్రత్యర్థుల్ని కట్టడి చేయడంలోనూ కీలకంగా వ్యవహరించింది. దీని కోసం ముందుగా పలువురు నేతలు, వ్యాపారుల ప్రొఫైళ్లు రూపొందించి ఎస్ఐబీ కార్యాలయంలో ప్రణీత్‌రావుకు ఇచ్చేవారు. అతను వారి కదలికలు, కార్యకలాపాలపై సాంకేతిక సాయంతో రహస్యంగా సమాచారం సేకరించి తిరిగి రాధాకిషన్‌రావుకు చేరవేసేవారు. దీని ఆధారంగా రాధాకిషన్‌రావు బృందం క్షేత్రస్థాయిలో ఆపరేషన్లు చేపట్టి ప్రధాన పార్టీ ప్రత్యర్థుల్ని కట్టడి చేయడంపై దృష్టి సారించింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన భుజంగరావు సైతం అదే పార్టీకి ప్రయోజనం చేకూర్చేందుకు ప్రైవేటు ప్రొఫైళ్లు రూపొందించినట్లు దర్యాప్తులో బహిర్గతమైంది. భువనగిరిలో ఏసీపీగా ఉన్న భుజంగరావు అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన అనంతరం తొలుత అనిశాకు బదిలీ అయ్యారు. అతను విధుల్లో చేరక ముందే ఇంటెలిజెన్స్‌లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అక్కడ పొలిటికల్ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తూ.. ప్రైవేటు ప్రొఫైళ్లను ప్రణీత్‌రావుకు అందించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

# కేసీఆర్ గతంలో చేసిన పాపాలే..

**హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ గతంలో చేసిన పాపాలే.. ప్రస్తుతం ఆయన్ని చుట్టుముడుతున్నాయని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్ చాట్‌గా మాట్లాడారు. గతంలో కేసీఆర్ పాలనను ఈ సందర్భంగా ఆయన తూర్పారబెట్టారు. యాదగిరిగుట్ట పేరు మార్చడమే కేసీఆర్ చేసిన మొదటి తప్పు అని ఆయన స్పష్టం చేశారు. దేవుడిపేరుతో అక్రమాలు,అవినీతికి తెగించారని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన పాపాల వల్లే రాష్ట్రంలో కరువు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే వర్షం.. వర్షం అంటే కాంగ్రెస్ పార్టీ అన్నట్లుగా ఉండేదని... కానీ కేసీఆర్ పాలనలో అలా లేదని చెప్పారు. ఎండిన పంటలను చూస్తుంటే ఏడుపు వస్తోందన్నారు. ఇక దేవుడి పేరు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి సర్వనాశనం చేశారంటూ కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. మా జిల్లాను నాశనం చేసి మళ్లీ ఏ మొఖం పెట్టుకోని నల్గొండ వస్తారంటూ కేసీఆర్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికారులతో సైతం పాపపు పనులు చేయించారన్నారు. దీంతో ఆ పాపంలో భాగస్వామ్యులైన అధికారులు నిద్రపోవడం లేదని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందరికి ఇండ్లు ఇచ్చామని.. అయితే కేసీఆర్ ఎవరికి ఇండ్లు ఇచ్చారో ఎవ్వరికీ తెలియదంటూ కోమటిరెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దళితబంధు, సీఎంఆర్ఎఫ్‌పై కమిషన్లు సైతం దండుకున్నారని గుర్తు చేశారు. అలాగే యాదగిరి గుట్టలో



స్కాం జరిగిందని.. దీనిపై లోక్‌సభ ఎన్నికలు పూర్తైన తర్వాత విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. అలాగే యాదాద్రి పేరు మళ్ళీ యాదగిరి గుట్టగా మారుస్తామని.. అయితే ఇది ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత దీనిపై ప్రభుత్వం జీవో జారీ చేస్తుందన్నారు. కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు రహదారి కోసం ఆ ఊళ్లోని నివాసాలను సైతం కూల్చారని ఆరోపించారు. రూ. 2 వందల కోట్లు ఖర్చు చేస్తే ఆలేరు ప్రాజెక్ట్ పూర్తయ్యేదని.. కానీ కేసీఆర్ ఆ పని చేయలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ఏ రాష్ట్రంలో చూడలేదని తెలిపారు. అయితే కేసీఆర్ ఫక్తు రాజకీయ నాయకుడయ్యారని ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అభివర్ణించారు. దాంతో ఆయన ప్రతీది రాజకీయ చేశారని విమర్శించారు. యాదగుట్టులో చేసిన పాపాలే కేసీఆర్‌కు తగిలిందని.. అందుకే బీఆర్ఆర్ పార్టీ ఖాళీ అవుతుందని.. ఆ క్రమంలోనే ఆయన

మైండ్ బ్లాంక్ అయి ఏదేదో మాట్లాడుతున్నారంటూ ఎద్దేవా చేశారు.రైతు బంధు 97 శాతం మంది రైతులకు పద్దాయని మాజీ మంత్రి హరీష్ రావు సంబంధం లేని విషయాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ లేదని.. అందుకే టికెట్ ఇచ్చినా వద్దు అని ప్రకటిస్తున్నారని చెప్పారు.

అయితే మేము గేట్లు తెరవలేదని.. కానీ మా పార్టీ గేట్లు పగలకొట్టి మరీ వచ్చి చేరుతున్నారని తెలిపారు. ఇక బీఆర్ఎస్ పార్టీలో ఒక్కరూ కూడా మిగలరని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా జోస్యం చెప్పారు. కొత్త వాళ్లకు టికెట్ ఇవ్వడమంటే.. గెలిచే వాళ్లకు ఇస్తున్నారని.. అంతేకానీ.. పాత వాళ్లకు అన్యాయం చేయడం లేదని చెప్పారు. హైదరాబాద్ లాంటి లోక్‌సభ స్థానంలో గెలిచే బలమైన అభ్యర్థినే బరిలో నిలుపబోతున్నట్లు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్

## మెట్రోలో 5. 28 లక్షల మంది రాకపోకలు

**హైదరాబాద్:** ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా మెట్రో రైళ్లలో అర్ధరాత్రి వరకు ప్రయాణికులు రాకపోకలు సాగించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ ముంబయి ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్ నేపథ్యంలో మెట్రో అధికారులు రైళ్ల సమయాన్ని అదనంగా పొడిగించారు. ఈ మేరకు చివరి రైలును అర్ధరాత్రి 12.15 గంటల వరకు నడిపించారు. కాగా, రాత్రివేళ ప్రవేశం కల్పించిన నాగోలు, ఉప్పల్ స్టేడి, ఎన్‌జీఆర్ఐ స్టేషన్ల నుంచి ప్రయాణికులు తరలివెళ్లారు. కేవలం ఉప్పల్ స్టేడియం నుంచే దాదాపు 28వేల మంది ప్రయాణించినట్లు అధికారులు తెలిపారు. రోజువారీ ప్రయాణికులు 5 లక్షల మంది ఉండగా.. బుధవారం మ్యాచ్ సందర్భంగా 5.28 లక్షల మంది రాకపోకలు సాగించారు. ఇదిలా ఉండగా, మ్యాచ్ ముగిసిన వెంటనే ఉప్పల్ స్టేడియం స్టేషన్ వద్ద రద్దీ ఎక్కువగా ఉండడంతో 20 నిమిషాల పాటు మెట్రో ప్రవేశద్వారం మూసివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ఆర్టీసీ బస్సుల ద్వారా సికింద్రాబాద్‌కు చేరుకుని అక్కడి నుంచి తమ గమ్యస్థానాలకు చేరారు

# ఆకుల రాలే కాలం ఇది

**పనికరాని ఆకులు చెత్తలో పడుతున్నాయి**

**కష్టకాలంలో ఉంటే ద్రోహం చేసి వెళుతున్నారు**

**పార్టీ వీడిన వారు కాళ్లు మొక్కినా వెనక్కి తీసుకోం**

**పార్టీని వీడుతున్న వారిపై మండిపడ్డ హరీష్ రావు**



**సిద్దిపేట:** కష్టకాలంలోఉన్న సమయంలో బీఆర్ఎస్ పార్టీని వీడుతున్న నాయకులపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పవర్ బ్రోకర్లు, అవకాశవాదులు పార్టీని విడిచి వెళ్లిపోతున్నారని, అలాంటి వారంతా పనికిరాని ఆకుల మాదిరిగా పార్టీని వీడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. దుబ్బాకలో ఏర్పాటు చేసిన మెదక్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఇవాళ మన పార్టీ నుంచి కొంతమంది నాయకులు బయటకు పోతున్నారు.. కార్యకర్తలు ఎవరూ వెళ్లడం లేదు. ఎవరైతే మధ్యలో మన పార్టీలోకి వచ్చారో.. పవర్ బ్రోకర్లు, అవకాశవాదులు పార్టీని విడిచి వెళ్లిపోతున్నారు. ఇప్పుడు ఎవరైతే పార్టీ నుంచి పోయారో.. రేపు కాళ్లు మొక్కినా పార్టీలోకి రానిచ్చేది లేదని పార్టీ నిర్ణయం తీసుకున్నది. ఎట్టి పరిస్థితుల్లో వారిని పార్టీలోకి రానిచ్చే పరిస్థితి లేదు. కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేస్తే కన్నతల్లికి ద్రోహం చేసినట్టే. ఇది అన్యాయం కాదా..? ఏం తక్కువ చేసింది పార్టీ వారికి.. అన్ని అవకాశాలు ఇచ్చింది. పార్టీకి అండగా నిలబడ్డ నాయకులను, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటాం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇది ఆకులు రాలేకాలం.. ఇప్పుడు అట్లనే మన పార్టీలో నుంచి కొన్ని పనికిరాని ఆకులు చెత్తకుప్పలో కలిసి పోతున్నాయి. ఆకులు పోయాక మళ్లీ కొత్త చిగురు వచ్చి ఆ చెట్టు వికసిస్తుంది. కొన్ని ఆకులు పోయినట్టు కొంతమంది నాయకులు పోవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంతకాలం బీఆర్ఎస్ పార్టీ ఉంటది. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం, ఈ ప్రాంతం కోసం పని చేసేపార్టీ. అసలు రేవంత్ రెడ్డి జై తెలంగాణ అన్నాడా..? ఉద్యమంలో జై తెలంగాణ అనలేదు. ఇప్పుడు కూడా అనడం లేదు. కనీసం ఏనాడైనా అమరవీరుల స్థూపం వద్ద రెండు పూలు పెట్టలేదు. తెలంగాణ మీద ప్రేమ లేదు ఆయనకు. తెలంగాణ కోసం పోరాడింది మనం. రాజకీయంగా లబ్ది పొందేందుకు వారు దుష్ప్రచారం చేస్తున్నారు. దుబ్బాక బీఆర్ఎస్ అడ్డా.. మెదక్ ఎంపీ స్థానంలో ఇప్పుడు కూడా బీఆర్ఎస్ గెలిచి తీరాల్సిందే. తెలంగాణ ఉద్యమం జరిగే సమయంలో పట్టున పది మంది లేకున్నా.. కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి.. రానే రాదు కానే కాదు అన్న తెలంగాణ తెచ్చి పెట్టిండు. తెలంగాణ వస్తదంటే ఆ రోజు ఎవరూ నమ్మలేదు.. కానీ కేసీఆర్ తెలంగాణను తెచ్చిపెట్టిండు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

# ఎన్టీఆర్‌కు వెన్నుపోటును మరచిపోగలమా !

**ఏనాడూ క్షమాపణలు కోరని చంద్రబాబు**

**వైకాపా నేతలు పదేపదే ఎద్దేవా**

విజయవాడ: తెలుగు ప్రజల ఆత్మగౌరవం నినాదంతొ ప్రాంతీయ పార్టీని పెట్టిన ఎన్టీఆర్ అదే పార్టీలో తన సొంత అల్లుడు చంద్రబాబు చేతిలోనే ఘోర పరాభవానికి గురయ్యారు. ఇది కళ్లముందున్న చరిత్ర. అదే ఎన్టీఆర్ జపం చేస్తూ ఇప్పుడు బాబు ఊరేగుతున్నారు. ఈ విషయాలను సరిగ్గా ఎన్నికల సమయంలో అధికార వైకాపా పదేపదే ప్రస్తావించి బాబును దెబ్బకొట్టే ప్రయత్నాలు చేస్తోంది. పార్టీ ఆవిర్భావ సంబరాలు జరుపుకుంటున్న వేళ ప్రధానంగా ఎన్టీర్ పదవీచ్యుతి గురించి చర్చించాలి. ఎన్టీఆర్‌ను గద్దెదించి అధికారం చేపట్టిన చంద్రబాబునాయుడు నాటి చీకటి రోజుల గురించి చర్చించాలి. లక్ష్మీపార్వతిని అడ్డం పెట్టుకుని ..ఆమెను బూచిగా చూపి ఎన్టీఆర్‌కు బాబు వెన్నుపోటు పొడిచారు. నేటికీ ఈ ఘటనపై ఏనాడు కూడా చంద్రబాబు కానీ, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు కానీ క్షమాపణలు కోరలేదు. తెలుగుదేశం పార్టీని, సిఎం పదవిని వెన్నుపోటుతో లాక్కున్న చంద్రబాబు ఏనాటికీ క్షంతవ్యుడు కాదని కొడాలి నాని లాంటి వారు నిత్యం విమర్శిస్తూనే ఉన్నారు. ఎన్టీఆర్ పదవీచ్యుతుడు కాకుండా ఉండివుంటే ఆయన ప్రధాని పదవిని అధిష్టించేవారని కొందరి అభిప్రాయం. ఇకపోతే ఎన్టీఆర్ బొమ్మకు దండలు వేయడం మాత్రం చంద్రబాబు బాగా అలవాటు చేసుకున్నారు. రెండెకరాల ఆసామి అయిన చంద్రాబాబు రాజకీయాల్లో వేలకోట్లు ఎలా సంపాదిం చాడో చర్చించాలి. కాంగ్రెస్ హయాంలో ఇందిర ప్రధానిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఎన్టీఆర్ పార్టీని స్థాపిస్తే అదే కాంగ్రెస్‌తో చంద్రబాబు తన రాజకీయ ప్రాపకం కోసం జట్టుకట్టాడు. తెలుగువారి ఆత్మగౌరవం ఢిల్లీ పెద్దల పాదాల కింద పడి నలుగుతున్న రోజుల్లో... మాటిమాటికి ముఖ్య మంత్రులను మారుస్తూ, వారిని అవహేళన చేస్తూ, కీలుబొమ్మలుగా ఆడిస్తున్న రోజుల్లో... తెలుగు వారంటే మద్రాసీలుగా పరిగణిస్తున్న రోజుల్లో.. తెలుగువారి ఆత్మగౌరవ నినాదం ఎత్తుకున్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. కాంగ్రెస్ పాలనపై ఎన్టీఆర్ దండయాత్రచేశారు. పార్టీ పెట్టిన 9 నెలల్లో పార్టీని అధికారం లోకి తీసుకుని వచ్చి సంచలనం సృష్టించారు. తెలుగు ప్రజల పౌరుష ప్రతాపాలకు పదును పెట్టగల కార్యశూరుడి ఎన్టీఆర్ ఆవిర్భవించారు. అద్భుతమైన పాలన అందించారు. కానీ నమ్మి నెత్తిన పెట్టుకున్న సొంత అల్లుడు చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు కలసి వెన్నుపోటు

పొడిచారు. నాటి గవర్నర్ కృష్ణకాంత్‌ను అడ్డంపెట్టుకుని అధికారాన్ని చంద్రబాబు చెర పట్టారు. ఈ క్రమంలో చంద్రబాబు క్యారెక్టర్‌పై టిడిపి కార్యకర్తలు చర్చించాలి. ఓట్లేసి గెలిపించిన నేతను పదవీచ్యుతుడిని చేశారు. సొంత మామ అన్న కనీస గౌరవం లేకుండా పదవికోసం అక్రమ రాజకీయాలకు, వెన్నుపోటు రాజకీయాలకు చంద్రబాబు పాల్పడిన తీరుపై తెలుగుజాతి మండిపడుతోంది. చంద్రబాబు ఆ తరవాత ఎప్పుడూ సొంతంగా ఏనాడూ గెలవలేదు. వాజ్‌పేయ్ హవాలో,మోడీ హవాలో మాత్రమే గెలిచిన సందర్భం గమనించాలి. ఎన్టీఆర్ సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తే బాబు దానికి తూట్లు పొడిచే మద్యానికి బార్లాగా గేట్లు తెరిచారు

. ఇవాళ మద్యపాన నిషేధం గురించి జగన్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న టిడిపి లేదా చంద్రబాబు.. ఆనాడు ఉమ్మడి ఎపిలో మద్యపాన నిషేధాన్ని ఎందుకు ఎత్తివేశారో చెప్పాలి. ప్రజలు దీనిని నిలదీయాలి. నిజానికి ఓ సమున్నత లక్ష్యంతో ఎన్టీఆర్ మద్యపాన నిషేధాన్ని తీసుకుని వచ్చారు. ఎన్టీఆర్ నుంచి అధికారన్ని లాక్కున్న చంద్రబాబు అలా ఎన్టీఆర్ పథకాలకు తూట్లు పొడిచారు. కిలో రెండు రూపాయల బియ్యాన్ని ఐదు రూపాయలకు పెంచారు. జనతా వస్త్రాలను పక్కన పెట్టారు. పేదలను విస్మరించి పెద్దలతో జతకట్టారు. ఇన్ని రకాలుగా టిడిపిని భ్రష్టు పట్టించిన చంద్రబాబు ఇవాళ ఎన్టీఆర్‌ను తలచుకుంటూ.. ఆయనకు నివాళి అర్పించినంద మాత్రాన పాపాలు కడిగేసుకున్నట్లు కాదు. 1982 మార్చి 29న ఎన్టీఆర్ పార్టీ ప్రకటించిన సందర్భం ఓ ఉద్విగ్నమైనది. ఆరోజు హైదరాబాద్, సాయకాలం పూట న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్.. ఎన్టీఆర్ అభిమానులతో ఆ ప్రాంగణం సందడిగా ఉంది. తెలుగువారి తెరవేలుపు నందమూరి తారకరామారావు పార్టీ ప్రకటన చేస్తారని తెలియడంతో యువత కూడా పెద్ద ఎత్తున వచ్చింది. ప్రాంగణం జనంతో నిండిపోయింది. అప్పుడే ఎన్టీఆర్ రావడంతో కోలాహలం మొదలయ్యింది.. రాజకీయ ప్రవేశం గురించి చెప్పిన ఎన్టీఆర్ పార్టీ పేరు కూడా అక్కడే ప్రకటించారు. ఓ అరగంట పాటు ప్రసంగించారు. పార్టీ పేరు తెలుగుదేశం అని అనగానే కేరింతలు, చప్పట్లతో ఆ ప్రాంగణం మారుమోగింది. అలా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. ప్రాంతీయపార్టీల చరిత్రలోనే ఓ కొత్త శకానికి నాంది పలికింది. ఆనాడు పార్టీ ప్రకటించిన సందర్భంలో ఈనాటి చంద్రబాబు లేడు. ఆయన కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా ఉన్నాడు. ఎన్టీఆర్ పై పోటీచేసి ఓడిస్తానని ప్రకటించాడు. అలా ప్రకటించి ఎన్నికల్లో ఓడిపోయాడు. తరవాత అల్లుడు అన్న ట్యాగ్‌తో పార్టీలో చేరి ఎన్టీఆర్‌నే మింగిన ఘనుడు చంద్రబాబు. దీనిని చరిత్ర కాదనలేని సత్యం. అలా పార్టీని ప్రకటించిన ఎన్టీఆర్ చైతన్య రథం సిద్దం చేసుకుని..

కుమారుడు హరికృష్ణ సారథిగా ముందుకి కదిలారు. తెలుగుదేశం పిలుస్తోంది..రా..కదలిరా అనే నినాదం ఊరూరా మార్మోగింది. ప్రజల అభిమానానికి దాసోహమంటూ అడుగడుగునా ఆయనకు జననీరాజ నాలు పలికారు. రాష్ట్రచరిత్రలో అలాంటి చైతన్య యాత్ర మరొకటి లేదనిపిస్తుంది. దశాబ్దాల చరిత్ర ఉన్న జాతీయ కాంగ్రెస్ పార్టీని..

కొన్ని నెలల వయసున్న పసికందు లాంటి పార్టీ చిత్తు చేసి ఓడించడం చరిత్ర లోనే అపూర్వం. ఆ ఘనత ఎన్టీఆర్‌కే దక్కింది. ఎన్టీఆర్ ప్రచార ప్రభంజనం కాంగ్రెస్ అధికార మదాన్ని మట్టికరిపించింది. కేవలం తొమ్మిదినెలల క్రితం అంకురార్పణ జరిగిన పార్టీ అధికారపార్టీ అంచనాలకి అందని రీతిలో అపూర్వ విజయం సాధించింది. 1983 జనవరి 7న మధ్యాహ్నం ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. తెలుగుదేశం 199 సీట్లు సాధించింది. కాంగ్రెసుకి కేవలం అరవై మాత్రమే దక్కాయి. ఈ విజయం రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లోనే ఓ అద్భుత విజయం. పోటీ చేసింది ఎవరైనా ఎన్టీఆర్ బొమ్మ పెట్టుకుంటే చాలు విజయం వరించింది. తెలుగుదేశం జెండా రాష్ట్రం నలుమూలలా సగర్వంగా రెపరెపలాడింది. అలా కాంగ్రెస్‌లో ఓటమిపాలైన చంద్రబాబు అధికారంలో ఉన్న ఎన్టీఆర్ పంచన చేరి.. మామకే వెన్నుపోటు పొడిచన తీరు తెలుగుజాతి ఏనాడు మరచిపోదు.

# బిఆర్ఎస్ నుంచి చెత్త వీడుతోంది

**పదవులకోసమే గతంలో పార్టీలో చేరారు**

**మోసకారుల జాబితా రాస్తే తొలిపేరు బీబీ పాటిల్‌దే**

**మండిపడ్డ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి**

**పార్టీ వీడిని వారికి కర్రుకాల్చి వాతపెడతారన్న దాసోజు**

**హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీని వీడి పలువురు ఇతర పార్టీల్లో చేరడంపై మాజీ శాసన సభాపతి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి చెత్తాఅంతా పోయింది.

గట్టి వాళ్లు మాత్రమే మిగిలారని పేర్కొన్నారు. పదవులు, వ్యాపారాల కోసం వచ్చిన వారే పార్టీ మారుతున్నారని విమర్శించారు. మోసకారుల జాబితా రాస్తే తొలిపేరు బీబీ పాటిల్‌దే ఉంటుందన్నారు. తొలినుంచి గులాబీ జెండా మోసిన నాయకులే పార్టీలో ఉన్నారని చెప్పారు. ఎంపీ ఎన్నికల తర్వాత బండ్లు ఓడలు, ఓడలు బండ్లవుతాయని చెప్పారు. ఎవరు పార్టీని వీడిన వచ్చే నష్టం లేదన్నారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ పార్టీకి సీనియర్లు రాజీనామా చేసి వెళ్లడం పట్ల దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్లం దగ్గరకు ఈగలు పోయినట్టుగా.. నీళ్లు వస్తే కప్పలు చేరినట్టుగా ఇవాళ అధికారంలోకి రావడంతో పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని వదిలేసి కాంగ్రెస్ మత్తడిలోకి దూకుతున్నారని చెప్పారు. పార్టీని వీడుతున్న సమయంలో వాళ్లందరూ ఆత్మగౌరవం గురించి మాట్లాడటం బాధగా ఉందని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం నాడు కే కేశవరావు కుమారుడు విప్లవ్ కుమార్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్నన్ని రోజులు వీళ్ళెవరికీ ఆత్మగౌరవం గుర్తు రాలేదని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. అధికారం పోయిన మూణ్నెళ్లలోనే చాలామంది నేతలు ఆగమాగమవుతూ సాకులు చెబుతూ పార్టీని వీడుతున్నారని అన్నారు. ఆత్మగౌరవం దెబ్బతిన్నదని.. అపాయింట్‌మెంట్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ పార్టీపై దాడి చేసేందుకు దుర్మార్గపు ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుగ్గ కార్లలో తిరిగి.. పదేండ్లు అధికారంతో వచ్చిన హోదా, డబ్బు, అధికారాన్ని అన్ని రకాలుగా వాడుకుని దాటవేత ధోరణికి పాల్పడుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా ఆత్మగౌరవం అంశాన్ని లేవనెత్తని మీరు.. అధికారం పోగానే ఆత్మగౌరవం అనే ప్రశ్న పట్టుకురావడం ఎంతవరకు సమంజసమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. ఇది వాళ్ల అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. దివాంచీ బార్ దగ్గర బీడీలు అమ్ముకునేటోడు అని దానం నాగేందర్‌ను టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అంతకంటే ఆత్మగౌరవాన్ని కించపరిచే కామెంట్ ఏదైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. బీడీలు అమ్ముకునేందుకు కూడా పనికిరాడు అంటూ అవమానించి.. ఆత్మన్యూనత భావంలోకి నెట్టివేసిన రేవంత్ రెడ్డి పంచన చేరే ప్రయత్నం చేసేటప్పుడు ఆత్మగౌరవం గుర్తురావడం లేదా? అని ప్రశ్నించారు.

' ఒక్కనాడు కూడా కేటీఆర్ నిన్ను బీడీలు అమ్ముకునేటోడు అని అనలేదే.. కేటీఆర్ ఎప్పుడూ నీ భూకబ్జాల గురించి మాట్లాడలేదే.. కేటీఆర్ ఒక్కనాడు కూడా ఏరకంగా అగౌరవపరచినట్టు కనబడలేదే.. కేసీఆర్ అయితే కన్నకొడుకు లెక్క చూసుకున్నడు.. అందుకే కేసీఆర్ నాకు దేవుడు లాంటి వాడు అని నువ్వే అంటుంటవ్.. చుట్టూ ఉన్నవాళ్ల కోసం దేవుడిని వదిలేస్తావా? దేవుడి కోసం దేవుడి దగ్గర ఉంటావా?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌లోకి వచ్చారు.. బీఆర్ఎస్ కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారు.. ఇంతకంటే నీచమైన అవకాశవాద రాజకీయం ఇంకోటి ఏదైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. కన్నతండ్రిలా వ్యవహరించిన కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీ వీడటం ఎంతవరకు న్యాయమో నాగేందర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దానం నాగేందర్ వైఎస్సార్ కూడా కాళ్లు మొక్కలేదు..

కానీ అనేకసార్లు కేసీఆర్ కాళ్లు మొక్కిండు.. మరి నిజంగానే కేసీఆర్ అవమాన పరిచేలా వ్యవహరించి ఉంటే.. ఆయన కాళ్లు మొక్కేవాడా? అని ప్రశ్నించారు. దానం నాగేందర్‌తో పాటు కే కేశవరావు, కడియం శ్రీహరిపైనా దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని పదవులు అనుభవించి.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వదిలివెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఏ మాత్రం ఇంగితం ఉన్నా బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పదవులకు రాజీనామా చేసి వెళ్లాలని డిమాండ్ చేశారు. మీకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమైన దానం నాగేందర్‌పై కూడా దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. అసలు ఆయనకు ఎవరు సలహాలు ఇస్తున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఒక దాంట్లో ఓడిపోయినా.. మరొకటి ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు ఉన్నారని అన్నారు. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై దానికి రాజీనామా చేయకుండా.. మరో పార్టీ నుంచి పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తే ఆటోమేటిగ్గా అనర్హత వేటు పడుతుందని తెలియజేశారు. ఒకేసారి రెండు పడవల మీద ప్రయాణం చేయాలని అనుకుంటున్నారు.. కానీ రెండింట్లోనూ మునక తప్పదని ఆయన విమర్శించారు. ఖైరతాబాద్ ప్రజలు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయమని జోస్యం చెప్పారు.

# పదేళ్లు పదవులు అనుభవించి దగా



**హైదరాబాద్:** గత పదేండ్లుగా పార్టీలో అనేక పదవులు అనుభవించిన కే కేశవరావు, కడియం శ్రీహరి ఇవాళ పార్టీ నుంచి జారుకున్నారని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కష్టకాలంలో బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటానని చెప్పి ఇవాళ కాసాని జ్ఞానేశ్వర్ ముందుకు వచ్చారు. అవకాశం ఇస్తే చేవెళ్లలో నేను నిలబడుతానని చెప్పారు. దీంతో కేసీఆర్ ఆయనకు అవకాశం కల్పించారు. కాసాని ధీరోదాత్తమైన నాయకుడు. బలహీన వర్గాల ముద్దుబిడ్డ, బడుగుల ఆశాజ్యోతి అని చాలా మంది అనేక ప్రసంగాలు ఇచ్చారు. అలా బీసీ జాతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్. ఒక్క రంగారెడ్డి జిల్లాకే కాదు.. రాష్ట్రం మొత్తానికి ఆయన సుపరిచితుడు. ముదిరాజ్‌లకు ఎంతో సేవ చేశారు అని కేటీఆర్ తెలిపారు. కష్టకాలంలో మన కోసం వచ్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి. మన కష్టంలో ఉంటే పెద్ద పెద్ద నాయకులు కే కేశవరావు, కడియం శ్రీహరి పార్టీ నుంచి జారుకుంటున్నారు. ఈ సమయంలో ధీరోదాత్తంగా నిలబడి నేనున్నా అంటూ ముందుకు వచ్చిన నాయకుడిని కడుపులో పెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. చేవెళ్లలో నిలబడ్డది కేసీఆర్.. అనుకొని కొట్లాడుదాం. ఆయన కోసం ఓటేస్తాం అనే కమిట్‌మెంట్‌తో పని చేద్దాం. పదేండ్లు పదవులు అనుభవించిన తర్వాత.. పోయేవాళ్లు రెండు రాళ్లు వేసి పోతారు. అది వారి విజ్ఞతకే వదిలేద్దాం.. కాలమే సమాధానం చెప్తుందని కేటీఆర్ అన్నారు.

# ఈ వియసులో ఇప్పుడు పార్టీ మారడం అవసరమా

**హైదరాబాద్:** తన తండ్రి, రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు బీఆర్ఎస్ పార్టీని వీడటం బాధగా ఉందని ఆయన కుమారుడు విప్లవ్‌కుమార్ అన్నారు. ఈ వయసులో పార్టీ మారడం ఏంటని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఒక సీనియర్ నాయకుడిగా అధినేత కేసీఆర్‌కు అండగా ఉండాల్సిందిపోయి.. పార్టీని వీడటం సరికాదని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో విప్లవ్‌కుమార్ మాట్లాడారు. కేశవరావు పదవుల కోసం కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారని తాను అనుకోవడం లేదని విప్లవ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ వయసులో ఆయనకు ఎలాంటి పోస్టులు అవసరం లేదని.. తన జీవితంలో ఎన్నో పదవులను అనుభవించారని తెలిపారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి ఆయన అవసరం ఉందని విప్లవ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ సమయంలో కేసీఆర్‌కు సలహాదారుడిగా ఉండి.. బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాల్సిందని చెప్పారు. పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్‌లోకి వచ్చినప్పుడు ఈ వయసులో పార్టీ మారడమేంటని ఆయన గురించి రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడారని.. ఇప్పుడు కేశవరావును ఎలా పార్టీలోకి పిలిచారని ప్రశ్నించారు. ఇన్నేండ్లు ఒకే పార్టీలో తామంతా

సంతోషంగా ఉన్నామని.. కానీ ఇప్పుడు తమ కుటుంబాన్ని రేవంత్ రెడ్డి విభజించాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మారే ఆలోచనపై పునరాలోచన చేయాలని కేశవరావును విప్లవ్‌కుమార్ కోరారు. బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని కోరారు. ప్రస్తుతం పార్టీకి మీరు కావాలని.. మీకు పార్టీ కావాలని వ్యాఖ్యానించారు. జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి బీఆర్ఎస్ నుంచే రాజకీయాల్లోకి వచ్చారని ఆయన గుర్తు చేశారు. 2016, 2021లో కార్పొరేటర్‌గా ఎంపికయ్యారని.. పార్టీ అధినేత ఆమెను జీహెచ్ఎంసీ మేయర్‌ను చేశారని అన్నారు. పార్టీ మనకు ఎంత చేసినప్పుడు మనం పార్టీతోనే ఉండటం సమంజసమని అన్నారు. ఆత్మగౌరవం ఉంటే పార్టీ ఇచ్చిన పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లోకి వెళ్లాలని డిమాండ్ చేశారు. దానం నాగేందర్ నమ్మదగిన మనిషి కాదని విప్లవ్ కుమార్ తెలిపారు. ఆయన్ను

చిన్నప్పటి నుంచి చూస్తున్నానని.. ఆయన ఎప్పుడూ ఒక పార్టీలో ఉండరని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ అధికారంలోకి వస్తే అందులోకి వెళ్తారని ఎద్దేవా చేశారు.

## ప్రజలే గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారు..



బీఆర్ఎస్‌లో జరుగుతున్న తాజా పరిణామాలపై 'ఎక్స్' వేదికగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. శూన్యం నుంచి సునామీ సృష్టించి, అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్నే సాధించిన ధీశాలి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటూ ట్వీట్ చేశారు. కొత్త తరం నాయకత్వాన్ని తయారు చేస్తామన్నారు కేటీఆర్. ప్రజలే బీఆర్ఎస్ పార్టీని కాపాడుకుంటారని వ్యాఖ్యానించారు. పోరాట పథంలో కదం తొక్కుదాం అంటూ బీఆర్ఎస్ కేడర్‌కు పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి కష్టాలు కొనసాగుతున్నాయి. నేతలు ఒక్కొక్కరిగా పార్టీని వదిలేసి కాంగ్రెస్‌లోకి వెళుతుండటం ఆందోళన కలిగిస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో వలసలు కారు పార్టీని కష్టాల్లోకి నెట్టేస్తోంది. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్య కూడా పోటీ నుంచి తప్పుకున్నారు. తండ్రి కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరతారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజా పరిణామాలపై స్పందించారు.. ట్విట్టర్ (ఎక్స్) వేదికగా పార్టీ కేడర్‌లో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. 'శూన్యం నుండి సునామీ సృష్టించి, అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్నే సాధించిన ధీశాలి మన కేసీఆర్. ఒక్కడుగా బయలుదేరి లక్షల మంది సైన్యాన్ని తయారు చేసి, ఎన్నో అవమానాలు, ద్రోహాలు, కుట్రలు, కుతంత్రాలు అన్నిటిని ఛేదించిన ధీరత్వం కేసీఆర్. అలాంటి ధీరుడిని కొన్ని కప్పదాట్లు, ద్రోహపు ఎత్తుగడలతో దెబ్బ తీయాలనుకునే రాజకీయ బేహారులకు తెలంగాణ ప్రజలే జవాబు చెబుతారు' అన్నారు. 'ప్రజా ఆశీర్వాదం, మద్దతుతో 14 ఏళ్లు పోరాడి, ఉద్యమ పార్టీగా తెలంగాణ సాధించి.. తెచ్చుకున్న తెలంగాణ దశను, దిశను మార్చి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్ గారిని, బీఆర్ఎస్ పార్టీని ప్రజలే గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారు. నికార్సైన కొత్త తరం నాయకత్వం తయారుచేస్తాం, పోరాట పంథాలో కదం తొక్కుదాం' అంటూ కేటీఆర్ స్పందించారు.

# లోక్‌సభ ఎన్నికల తర్వాత ఏం జరగనుంది?

## నిన్నటి దాకా నీ వంతు.. ఇప్పుడు నావంతు అన్నట్టుగా.. కాంగ్రెస్ గేట్లు ఎత్తడం మొదలుపెట్టడంతో గులాబీ పార్టీ నుంచి నేతల రాక

తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు జోరు అందుకున్నాయి. బీఆర్ఎస్ హయాంలో కీలక పదవులు చేపట్టిన నేతలు సైతం ఇప్పుడు పార్టీ మారుతున్నారు. లోక్ సభ ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేలు సైతం పెద్ద సంఖ్యలో హస్తం గూటికి చేరే అవకాశం ఉంది. దీంతో గతంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొందో.. బీఆర్ఎస్‌కు కూడా అదే పరిస్థితి ఎదురుకావచ్చు. కానీ బీఆర్ఎస్‌ను నిర్వీర్యం చేయాలని కాంగ్రెస్ భావిస్తే.. పరిస్థితి పూర్తిగా మారొచ్చు.

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ ఫినిక్స్ పక్షిలా పుంజుకొని అధికారంలోకి రాగా.. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ భంగపాటుకు గురైంది. ఇక లోక్ సభ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగడం, కవిత అరెస్ట్, ఫోన్ ట్యాపింగ్ రచ్చతో బీఆర్ఎస్ పార్టీ గతంలో ఎన్నడూ లేనంతగా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటోంది.

కాంగ్రెస్ మెల్లగా గేట్లు ఎత్తడం మొదలుపెట్టడంతో గులాబీ పార్టీ నుంచి నేతల రాక మొదలైంది. సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు.. పోటీపోటీగా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఎంతో కాలంగా కేటీఆర్ వెన్నంటి నడిచిన బొంతు రామ్మోహన్‌తోపాటు దానం నాగేందర్, జితేందర్ రెడ్డి, పట్నం మహేందర్ తదితరులు హస్తం గూటికి చేరగా.. కడియం శ్రీహరి, కేకే, ఇంద్రకరణ్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు సైతం బీఆర్ఎస్‌కు బైబై చెప్పి కాంగ్రెస్‌లో చేరుతుండటం గులాబీ కార్యకర్తలను విస్మయానికి గురి చేస్తోంది.

**కాంగ్రెస్ గేట్లు ఎత్తితే..?**

కాంగ్రెస్ పూర్తి స్థాయిలో గేట్లు ఎత్తితే.. బీఆర్ఎస్‌లో ఎంత మంది మిగులుతారో చెప్పడం కూడా కష్టమే అనేంతలా పరిస్థితి మారింది. లోక్ సభ ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం జరుగుతోంది. ఓవైపు కాంగ్రెస్, మరోవైపు బీజేపీ.. దీంతో బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోయిన పరిస్థితి. ఆరు నెలల క్రితం వరకు అత్యంత పటిష్టంగా కనిపించిన గులాబీ పార్టీ.. ఒకే ఒక్క ఓటమితో వడదెబ్బ తగిలిన గులాబీలా వాడిపోయింది. గులాబీ రేకలు ఒక్కొక్కటిగా రాలిపోతున్నాయి. బీఆర్ఎస్‌కు ముందు ముందు రానుంది రాజకీయంగా మండు వేసవి అనే చెప్పొచ్చు. రేపటి పరిస్థితులను ఊహించుకొనే.. బీఆర్ఎస్ నాయకులు ఒక్కొక్కరుగా తమకు అనువైన తావు కోసం వెతుక్కుంటున్నారు.





**అదే సీన్ రిపీట్..**

కేసీఆర్ అధికారంలోకి వచ్చిన కొత్తలో రాజకీయ పునరేకీకరణ పేరిట టీడీపీ, కాంగ్రెస్ పార్టీలను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఉనికిని కోల్పోయింది. ఇక 2018 ఎన్నికల తర్వాత కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేశారు. కాంగ్రెస్ తరపున గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలను టీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా లేకుండా చేశారు. ఆ దెబ్బతో కాంగ్రెస్ పార్టీ కోలుకోలేకపోయింది. మరోవైపు బీజేపీ పుంజుకోవడంతో.. కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. కానీ 2023 ఎన్నికల్లో రేవంత్ నాయకత్వంలోని మూడు రంగుల జెండా రెపరెపలాడి. కాంగ్రెస్ గెలవడానికి ప్రధాన కారణం.. కేసీఆర్ పాలన మీద వ్యతిరేకతే. ఆరు హామీలు, తెలంగాణ ఇచ్చిన పార్టీ అనే సానుభూతి.. ఇవన్నీ ఆ తర్వాతే.

నిన్నటి దాకా నీ వంతు.. ఇప్పుడు నావంతు అన్నట్టుగా.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా బీఆర్ఎస్ దుకాణం ఖాళీ చేసే ప్రయత్నాల్లో ఉంది. మరోవైపు బీజేపీ సైతం బీఆర్ఎస్ నుంచి నేతలను లాగేసుకునే పనిలో పడింది. ఓవైపు కాంగ్రెస్, మరోవైపు బీజేపీ.. కలిసి బీఆర్ఎస్ నాయకత్వాన్ని ఊపిరి పీల్చుకోనీయడం లేదు. ముఖ్యంగా

> రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ ఫినిక్స్ పక్షిలా పుంజుకొని అధికారంలోకి రాగా.. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ భంగపాటుకు గురైంది. ఇక లోక్ సభ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగడం, కవిత అరెస్ట్, ఫోన్ ట్యాపింగ్ రచ్చతో బీఆర్ఎస్ పార్టీ గతంలో ఎన్నడూ లేనంతగా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ మెల్లగా గేట్లు ఎత్తడం మొదలుపెట్టడంతో గులాబీ పార్టీ నుంచి నేతల రాక మొదలైంది. సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు.. పోటీపోటీగా కాంగ్రెస్‌లో చేరుతున్నారు.

రేవంత్ దూకుడుతో బీఆర్ఎస్ కకావికాలం అయ్యే పరిస్థితి. దేశంలోని మిగతా రాష్ట్రాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలు కూలిపోతున్న నేపథ్యంలో.. లోక్ సభ ఎన్నికల తర్వాత తమ ప్రభుత్వానికి ఇబ్బంది తలెత్తకుండా చూసుకోవడం కోసం.. ముందు జాగ్రత్తగానే కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరతీసిందనే అభిప్రాయం కూడా ఉంది.


**కొత్త నాయకత్వాన్ని తయారు చేస్తాం**

ఎంత మంది నాయకులు పార్టీని వీడినా తమ మంచికే అని బీఆర్ఎస్ పెద్దలు చెబుతున్నారు. తాము కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకుంటామని బీఆర్ఎస్ అధినాయకత్వం చెబుతోంది. కాంగ్రెస్ పార్టీని నామరూపాల్లేకుండా చేయబోయిన బీఆర్ఎస్‌ను ప్రజలు నేలకు దించారు. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పనిగా బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తే.. ప్రజల్లో ఆ పార్టీ పట్ల సానుభూతి పెరిగే అవకాశం ఉంది. మరోవైపు కొత్త నేతల రాకతో హస్తం బండి కూడా ఓవర్‌లోడ్ అయ్యే ప్రమాదం లేకపోలేదు.

**తొక్కితే మరింత పైకి..**

ఈ వేసవిలో వడదెబ్బకు గులాబీ వాడిపోవచ్చు. కానీ ఆ తర్వాత వచ్చే వర్షాకాలంలో గులాబీ మళ్లీ వికసించే అవకాశం లేకపోలేదు. కాకపోతే.. లోక్ సభ ఎన్నికల తర్వాత నిలదొక్కుకోవడానికి, ఉనికిని కాపాడుకోవడానికి బీఆర్ఎస్ తీవ్రంగా చెమటోడ్చాల్సి రావచ్చు. ఇప్పటికైనా గతంలో చేసిన తప్పిదాలను సరిదిద్దుకొని.. ప్రజలకు చేరువయ్యే దిశగా బీఆర్ఎస్ నాయకత్వం కార్యచరణ మొదలుపెడితే.. 2028 నాటికి లేదంటే ఆ తర్వాతి ఎన్నికల నాటికైనా మళ్లీ గులాబీ పార్టీకి మంచి రోజులు వచ్చే అవకాశం ఉంది. అయితే బీఆర్ఎస్‌ను నామరూపాల్లేకుండా చేయాలని భావిస్తే మాత్రం అనుకున్న దాని కంటే వేంగా ఆ పార్టీ పుంజుకునేందుకు ఆస్కారం ఉంది.

## తీహార్ జైలు అధికారుల తీరుపై కవిత కోర్టులో పిటిషన్



ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. ప్రస్తుతం జ్యూడీషియల్ రిమాండ్ కింద తీహార్ జైలులో ఖైదీగా ఉన్నారు. అయితే.. 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించిన కోర్టు.. కొన్ని ప్రత్యేక వెసులుబాట్లకు అనుమతించింది. ఇంటి భోజనం, బ్లాంకెట్, బెడ్ షీట్స్, మందులు, పెన్నులు, పేపర్లు, పుస్తకాలు.. ఇలా కొన్నింటికి అనుమతించగా.. జైలు అధికారులు వాటిని నిరాకరిస్తున్నారంటూ కోర్టులో కవిత పిటిషన్ వేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో భాగంగా జ్యూడీషియల్ రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను.. తీహార్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. కాగా.. తీహార్ జైలు అధికారుల తీరును ఖండిస్తూ కవిత కోర్టును ఆశ్రయించారు. జైలు అధికారులు కోర్టు ఆదేశాలను పట్టించుకోవటం లేదని ఆరోపిస్తూ.. గురువారం రోజు రౌజ్ ఎవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన సమయంలోనే.. ఇంటి భోజనం, బెడ్ షీట్స్, దుప్పట్లు, పెన్నులు, పేపర్లు తెప్పించుకునేందుకు కవితకు కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. అయితే.. జైలు అధికారులు మాత్రం అవేవీ అనుమతించడం లేదంటూ కవిత కోర్టులో పిటిషన్ వేశారు. వెంటనే.. ఇంటి భోజనం సహా మిగతా సదుపాయాలన్నీ కల్పించేలా జైలు అధికారులను ఆదేశించాలని కోర్టుకు విజ్ఞప్తి చేస్తూ కవిత పిటిషన్ పేర్కొంది.

అయితే.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణ నిమిత్తం కవితను అరెస్టు చేసిన ఈడీ.. ముందుగా కోర్టు అనుమతితో 7 రోజుల పాటు రిమాండ్‌లోకి తీసుకోగా.. ఆ తర్వాత మరో 3 రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. అనంతరం కోర్టు ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో.. ఆమెను తీహార్ జైలుకు తరలించారు. అయితే.. కవితకు హైబీపీ ఉన్న కారణంగా జైలులో.. కవితకు కొన్ని వెసులుబాట్లు కల్పించేందుకు కోర్టు అనుమతించింది.

ఇంటి భోజనంతో పాటు.. మెడిసిన్స్, పెన్నులు, పుస్తకాలు, పేపర్స్, బెడ్ షీట్, బ్లాంకెట్లు ఇంటి నుంచి తెప్పించుకునేందుకు కవితకు కోర్టు పర్మిషన్ ఇచ్చింది. అంతేకాదు.. ఒంటిపై బంగారు ఆభరణాలు కూడా పెట్టుకునేందుకు కోర్టు అనుమతినిచ్చింది. అయితే.. ఈ సౌకర్యాలేవీ జైలు అధికారులు తనకు కల్పించడం లేదని కవిత కోర్టులో పిటిషన్ వేయటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కవిత పిటిషన్‌పై స్పందించిన కోర్టు.. ఎల్లుండి (మార్చి 30) విచారించనున్నట్టు వెల్లడించింది.

## బరి నుంచి దానం ఔట్.. బొంతు రామ్మోహన్ ఇన్..!



పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణలో రాజకీయ పరిణామాలు రోజు రోజుకు మారిపోతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి వరుసపెట్టి కీలక నేతలు కాంగ్రెస్ దారి పట్టగా.. వలసవచ్చిన నేతలకే ఏఐసీసీ ఎంపీ టికెట్లు ఇస్తోంది. ఈ క్రమంలోనే.. ఖైరతాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ప్రకటించగా.. ఇప్పుడు ఆయనను మార్చే యోచనలో ఉన్నట్టు వార్తలు ప్రచారం జరుగుతున్నాయి. ఆయన స్థానంలో బొంతు రామ్మోహన్ పేరు తెర మీదికి వచ్చినట్టు సమాచారం. లోక్ సభ ఎన్నికల వేళ తెలంగాణలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఎప్పటికప్పుడు సమీకరణాలు మారుతూనే ఉన్నాయి. బీఆర్ఎస్ నేతలు పోటీ పడి మరీ కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన నేతలకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్లు కూడా ఇస్తోంది. ఈ క్రమంలోనే.. బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఖైరతాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు కూడా సికింద్రాబాద్ ఎంపీ టికెట్ కూడా ఖరారుల చేసింది కాంగ్రెస్ అధిష్ఠానం. అయితే.. పలు కారణాలతో దానం తీరుపై అధిష్ఠానం గుర్రుగా ఉందని.. ఆయనను పోటీ నుంచి తప్పించాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ స్థానంలో.. సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఆశించి కాంగ్రెస్‌లో చేరిన మరో బీఆర్ఎస్ నేత బొంతు రామ్మోహన్‌కు టికెట్ ఇవ్వాలని యోచిస్తున్నట్టు సమాచారం అందుతోంది. అయితే.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం.. ఇప్పుడు ఎందుకు మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే యోచనలో ఉందన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. అయితే.. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చే సమయంలోనే.. సికింద్రాబాద్ ఎంపీ టికెట్ కావాలని డిమాండ్ చేసిన దానంకు.. అధిష్ఠానం కొన్ని కండీషన్స్ పెట్టినట్టు తెలుస్తోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే.. ఎంపీ టికెట్ ఉంటుందని దానంకు ఏఐసీసీ ఇదివరకే స్పష్టం చేసినట్టు సమాచారం. ఆ కండీషన్‌కు ఒప్పుకోవటంతోనే.. మూడో జాబితాలో దానం నాగేందర్ పేరును కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించింది.

అయితే కండువా కప్పుకునే ముందు అన్ని కండీషన్లకు ఒప్పుకున్న దానం నాగేందర్.. ఇప్పటికి కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదు. ఈ క్రమంలోనే.. దానం నాగేందర్ ఎన్నికపై హైకోర్టులో పిటిషన్లు కూడా దాఖలు అవుతున్నాయి. కోర్టు కూడా దానంకు నోటీసులు జారీ చేసింది. ఈ పరిణామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఏఐసీసీ.. దానం నాగేందర్‌ను పోటీ నుంచి తప్పించి ఆ స్థానంలో మరో అభ్యర్థిని నిలపాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే.. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కూడా సికింద్రాబాద్ ఎంపీ టికెట్‌నే ఆశించి రావటంతో.. ప్రస్తుతం ఆయన పేరును కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో అధిష్ఠానం నిర్ణయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఎన్నికల బరి నుంచి తప్పుకున్న కడియం కావ్య..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. బీఆర్ఎస్ పార్టీకి వరుస షాకులు తగులుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అగ్రనేత కే కేశవరావు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్టు ప్రకటించి.. గులాబీ శ్రేణులకు షాకివ్వగా.. గంటల వ్యవధిలోనే వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య మరో ఊహించని ట్విస్ట్ ఇచ్చారు. తాను లోక్ సభ బరిలో నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించి.. అందరినీ అవాక్కయ్యేలా చేశారు. ఈ విషయాన్ని కేసీఆర్‌కు లేఖ ద్వారా తెలపగా.. అందులో సంచలన విషయాలు వెల్లడించారు.



లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్నాకొద్దీ.. బీఆర్ఎస్‌కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఓవైపు.. పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుతుంటే.. మరోవైపు పార్టీలోని కీలక నేతలు కాంగ్రెస్ పార్టీకి క్యూ కడుతున్నారు. ఈ క్రమంలోనే పార్టీలోని అగ్రనేత, రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు, ఆయన కుమార్తె, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్టు అధికారికంగా ప్రకటించేశారు. కేకే ప్రకటనతోనే పార్టీ శ్రేణులు షాక్‌లో ఉంటే.. మాజీ మంత్రి కడియం శ్రీహరి కుమార్తె, వరంగల్ లోక్ సభ అభ్యర్థి కడియం కావ్య ఊహించని ట్విస్ట్ ఇచ్చారు. తాను లోక్‌సభ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటు న్నట్లు కడియం కావ్య ప్రకటించారు. ఈ మేరకు గురువారం రాత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు లేఖ రూపంలో ఈ విషయాన్ని తెలియజేశారు. అయితే.. లేఖలో బీఆర్ఎస్‌పై కడియం కావ్య సంచలన ఆరోపణలు చేయటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అవినీతి ఆరోపణలు, భూకబ్జాలు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, లిక్కర్ కుంభకోణం కేసులతో బీఆర్ఎస్ ప్రతిష్ఠ పూర్తిగా దిగజారిపోయిందని లేఖలో కావ్య పేర్కొన్నారు.

వీటితో పాటు.. జిల్లాలోని నాయకుల మధ్య సమన్వయం, సహకారం లేకపోవడం.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరించడం పార్టీకి మరింత నష్టం చేస్తున్నాయని కావ్య తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తాను పోటీ నుంచి విరమించుకోవాలని నిర్ణయించుకున్నట్లు లేఖలో కావ్య వివరించారు. ఇదే విషయాన్ని కడియం శ్రీహరి కూడా ధ్రువీకరించారు. కాగా.. తండ్రీకూతుళ్లకు కాంగ్రెస్ నుంచి ఆహ్వానం అందగా.. దాన్ని తిరస్కరించి బీఆర్ఎస్ నుంచి వరంగల్ ఎంపీ టికెట్ అందుకున్నారు. అయితే.. లోక్ సభ టికెట్ ఇచ్చిన తర్వాత ఇప్పుడు ఇలాంటి నిర్ణయం తీసుకోవటంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. మరి.. ఈ తండ్రీకూతుళ్లు బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగు తారా.. లేదా కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అవుతారా అన్న చర్చకు తెర లేచింది. మరోవైపు.. వరంగల్ సీటును కాంగ్రెస్ పార్టీ హోల్డ్‌లో పెట్టటం గమనార్హం. దీంతో.. కాంగ్రెస్‌లో చేరి కడియం శ్రీహరే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారన్న వార్తలు వస్తున్నాయి.

## రైతులకు గుడ్‌న్యూస్.. మూడు రోజులు ముందుగానే!

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగానే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేందుకు సిద్ధమైంది. జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్ణయించుకుని కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు అన్ని జిల్లాలో కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలల్లో ఉండటంతో.. నిబంధనలు పాటిస్తూనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

తెలంగాణలో రైతులకు ఇది గుడ్‌న్యూస్ అనే చెప్పాలి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణలో రైతులకు శుభవార్త. జిల్లాల వారీగా యాసంగి (రబీ) ధాన్యం కొనుగోళ్ల టార్గెట్‌లు ఖరారయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో 6.24 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నారు. అలాగే జగిత్యాల, నల్గొండ, కామారెడ్డి, మెదక్, యాదాద్రి జిల్లాలు ఉన్నాయి. హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో 7,149 కొనుగోలు కేంద్రాల ద్వారా 75.40 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది పౌరసరఫరాల సంస్థ. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి కేంద్రాలు ప్రారంభం కావాల్సి ఉంది.. నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో మార్చి మొదటివారంలోనే వరి కోతలు మొదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనతో ఈ రెండు జిల్లాల్లో ముందే ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం అనుమతించింది. ఈ జిల్లాల్లో మొత్తం 836 కొనుగోలు కేంద్రాలకు గాను అవసరమైన ప్రాంతాల్ని గుర్తించి 19 కేంద్రాలను ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో కొనుగోలు కేంద్రాలను ఎన్నికల నియమావళికి అనుగుణంగానే ప్రారంభించాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో కలెక్టర్, అదనపు కలెక్టర్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మేడ్చల్, నారాయణపేట, రంగారెడ్డి జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల సంఖ్య తక్కువగా ఉంది. మొత్తం కలిపి ఈ సంఖ్య 257..



ఈ జిల్లాల్లో ధాన్యం ఉత్పత్తి తక్కువగా ఉండటం ఒక కారణంగా ఉంది. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు ధాన్యం రవాణా వాహనాల టెండర్లను, గన్నీ టెండర్లను ఖరారు చేసేందుకు అనుమతి కోసం ఎన్నికల కమిషన్‌కు పౌరసరఫరాల సంస్థ లేఖ రాసింది. ఎండల తీవ్రత నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో తాగునీటి సరఫరా, టెంట్లు, చలువ పందిళ్లు వంటి ఏర్పాట్లు చేయాలని సీఎస్ కలెక్టర్లను ఆదేశించారు. సూర్యాపేట, కరీంనగర్,సిద్దిపేట, సిరిసిల్ల, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, జనగామ, వనపర్తి, నిర్మల్, సంగారెడ్డి, మంచిర్యాల, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట, మహబూబ్‌నగర్, భూపాలపల్లి, ఖమ్మం, వికారాబాద్, గద్వాల, ములుగు, కొత్తగూడెం, రంగారెడ్డి, ఆసిఫాబాద్, మేడ్చల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ధాన్యం కొనుగోలు చేస్తారు. ఆయా జిల్లాల్లో లక్ష్యాలను బట్టి ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు.

## బండరాయితో మోది హత్య

బండరాయితో మోది మహిళను అత్యంత కిరాతకంగా హతమార్చిన ఘటన హైదరాబాద్ నగరంలోన చోటుచేసుకుంది. మైలార్‌దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమీపంలో శుక్రవారం ఉదయం ఓ మహిళ మృతదేహం లభ్యమైంది.

అయితే, ఆమెను గుర్తుతెలియని వ్యక్తులు తలపై బండరాయితో బలంగా కొట్టి చంపినట్లుగా అనవాళ్లు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ పరిధిలోని కాటేదాన్‌లో దారుణం చోటుచేసుకుంది. గుర్తుతెలియని మహిళ హత్యకు గురయ్యింది. స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద మహిళ తలపై దుండగులు బండరాయితో మోదీ హతమార్చారు. బాధితురాలిపై అత్యాచారం చేసిన తర్వాత ఘాతానికి పాల్పడినట్టు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారమిచ్చారు.

హుటా హుటిన ఘటన స్థలానికి చేరుకున్న మైలార్‌దేవ్ పల్లి పోలీసులు..మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. క్లూస్ టీం, డాగ్ స్కాట్ బృందాలు రంగంలోకి దిగి ఆధారాలు కోసం గాలిస్తున్నాయి.

హత్యాచారాని గురైన మహిళ వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఘటనా స్థలిలో లభించిన ఆధారాలను బట్టి ఆమెను సమీరాఖాన్‌గా గుర్తించారు. కాగా, ఆమె ప్రియుడే సమీరాను హత్య చేసి ఉండొచ్చని పోలీసుల ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు.. నిందితుడి కోసం గాలిస్తున్నారు. అలాగే, పోస్ట్‌మార్టం తర్వాతే ఆమెపై అత్యాచారం జరిగిందా? లేదా? అనేది తెలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే హత్య ఎలా జరిగింది? అనేది స్పష్టత వస్తుంది.

'మహిళను తలపై బండరాళ్లతో దాడిచేయడంతో మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు.. హత్యకు ముందు ఆమె లైంగిక వేధింపులకు గురైందా అనే విషయంతో సహా అన్ని కోణాల్లోనూ మేము దర్యాప్తు చేస్తున్నాం' అని పోలీసులు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశామని చెప్పారు. అనుమానితుల గురించి తెలుసుకోడానికి ఘటనా స్థలికి చుట్టుపక్కల ఉన్న ప్రదేశాల్లోని సీసీటీవీలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. అక్కడే ఈ హత్య జరిగిందా? లేక మరే ప్రాంతంలో హత్య చేసి శవాన్ని ఇక్కడ పడేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్టు చెప్పారు.


VC NEWS వేగుచుక్క
TELUGU DAILY NEWS
శనివారం 30 మార్చి 2024



# సగం బలంతో పోరాడాల్సి వచ్చింది

సమంత సినిమా షూటింగ్స్‌కు ఏడాది బ్రేక్ తీసుకున్న సమంత తిరిగి షూటింగ్స్‌కు హాజరు అయ్యేందుకు రెడీ అవుతోంది సినిమా షూటింగ్స్‌కు ఏడాది బ్రేక్ తీసుకున్న సమంత తిరిగి షూటింగ్స్‌కు హాజరు అయ్యేందుకు రెడీ అవుతోంది. సినిమా షూటింగ్స్ కంటే ముందు సమంత తాను ఇప్పటికే నటించిన సిటాడెల్ వెబ్ సిరీస్ ప్రమోషన్ లో పాల్గొనబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల సిటాడెల్‌కి సంబంధించిన ప్రమోషన్ లో సమంత పాల్గొంది. ఆ సమయంలో సిటాడెల్ షూటింగ్ అనుభవాలను పంచుకుంది. సిటాడెల్ కోసం ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. ఆ సమయంలో నేను చాలా బలహీన స్థితిలో ఉన్నాను. అప్పటికే నేను చాలా వీక్ అయ్యాను. నాలో ఉన్న బలం మయోసైటిస్ వల్ల 50 శాతం కు పడిపోయింది. ఆ యాబై శాతం బలంతోనే సిటాడెల్ కోసం కఠినమైన శిక్షణ తీసుకున్నట్లుగా సమంత పేర్కొంది. ఇమ్యూనిటీ లేక చాలా ఇబ్బంది పడుతున్న సమయంలో కూడా సిటాడెల్ షూటింగ్ లో పాల్గొన్నట్లుగా సమంత తెలియజేసింది. తన వీక్‌నెస్ ను ఆ సమయంలో బయటకు తెలియకుండా చూసుకున్నట్లుగా పేర్కొంది. గత ఏడాది ఖుషి సినిమా తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన సమంత త్వరలో సిటాడెల్ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ముందు ముందు వరుసగా హిందీ సినిమాల్లో నటించాలని, హిందీ వెబ్ సిరీస్ ల్లో నటించి నటిగా తనను తాను నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సన్నిహితుల వద్ద సమంత చెప్పినట్లు సమాచారం అందుతోంది.

# పక్కా పర్ఫెక్ట్ ఫ్యామిలీ స్టార్



'గీత గోవిందం' తర్వాత మరోసారి విజయ్ దేవరకొండ-పరశురాం ఫ్యామిలీ స్టార్‌తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. 'గీత గోవిందం' తర్వాత మరోసారి విజయ్ దేవరకొండ-పరశురాం ఫ్యామిలీ స్టార్ తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఆ కలయికతోనే 'గీత గోవిందం' కి సీక్వెల్ చేస్తున్నారా? అన్న సందేహాలు తెరపైకి వచ్చాయి. అందుకు తగ్గట్టు 'ఫ్యామిలీస్టార్' అనే టైటిల్ ప్రకటించడంతో కంటెంట్ అలాగే ఉండ బోతుందని దాదాపు ఓ అంచానికి వచ్చేసారంతా. అటుపై రిలీజ్ అయిన టీజర్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ తో మరింత ఆధారం దొరికింది. విజయ్ లుంగీ లుక్..వంట గదిలో వ్యవహారాలు..పిసినారి తనం..'గీతగోవిందం' లో పాత్రల్ని రివర్స్ చేసినా ఇలా కొన్ని హింట్లు పర్ఫెక్ట్ ఫ్యామిలీ స్టార్ లానే అనిపించాయి. తాజాగా ట్రైలర్ తో ఇది పక్కా ఫ్యామిలీ మూవీ అని తేలిపోయింది. 'గీతగోవిందం' కి సీక్వెల్ లా అనిపిస్తుంది. మరోసారి విజయ్ ఇమేజ్ ని..లేడీ ఫాలోయింగ్‌ని దృష్టిలో పెట్టుకుని రాసుకున్న కథలా తెలుస్తుంది. హీరోయిన్ హీరో వెంట పడటం... అటుపై హీరో కాదనడం..తప్పు తెలుసుకున్న హీరో విదేశాలు వెళ్లి ఒప్పించడాన్ని పరశురాం తనదైన శైలిలో కామెడీ టచప్‌తో ఆవిష్కరించాడు. సీనియర్ బ్యూటీ అందాల షో అలాగే విజయ్ లో యాక్షన్ స్టార్ ని హైలైట్ చేసాడు. నేనైతే మీకు ఫుల్లుగా పడిపోయా అంటూ మృణాల్ ఠాకూర్ చెప్పిన రొమాంటిక్ డైలాగ్ ఆకట్టుకుంటోంది. బుర్ర బద్దలైపోతుద్ది కొడకా... భయపడాలిరా ఇంకోసారి ఎవరైనా చులకనగా మాట్లాడాలంటే? అంటూ విజయ్ విలన్స్‌కు వార్నింగ్ ఇచ్చే సీన్స్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచాయి. హీరో లో మెంటల్ లెవల్ ని టచ్ చేసినట్లు కనిస్తుంది. కోపం ఎగిరి పోతుందంటే నన్ను కొట్టవే బాబు! అంటూ ట్రైలర్ చివర్లో విజయ్ దేవరకొండ అనగానే మృణాల్ అతడి చెంపపై లాగి పెట్టి కొట్టడం ఆకట్టుకుంటోంది. ఆ స్టార్ హీరో మాటే నిజమైంది! మిడిల్ క్లాస్ కుర్రాడిలో స్టైలిష్‌గా కనిపిస్తూనే కామెడీతోనే నవ్వించాడు. హీరో-హీరోయిన్ల ఇద్దరి మధ్య కెమిస్ట్రీ హైలైట్. ప్రస్తుతం ట్రైలర్ ట్రెండింగ్‌లో ఉంది. రిలీజైన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ లో తెలుగు..తమిళ..హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రానికి గోపీ సుందర్ సంగీతం అందిస్తున్నారు.

# ఫ్యాన్స్ తెలుసుకుని తీరాలి!



పౌరాణిక కథలతో సినిమాలు తీయడం సాహసం. వాటిలో పాత్రల్ని పాత్రధారుల్ని గొప్పగా మలిచి పౌరాణిక కథలతో సినిమాలు తీయడం సాహసం. వాటిలో పాత్రల్ని పాత్రధారుల్ని గొప్పగా మలిచి.. నాటితరంతో పోలికలు చూసేవారిని మెప్పించడం చాలా గొప్పతనం అవుతుంది. స్టేజీ డ్రామా ఆర్టిస్టులకు ధీటుగా మెప్పించేలా చేయడం అంత సులువు కాదు. పౌరాణికాలను లేదా జానపద కథలను ఎంపిక చేసుకున్న దర్శకులకు ఆర్టిస్టుల సెలక్షన్‌లో ఇలాంటి చాలా సవాళ్లు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా పాత్రధారుల ఎంపిక సరిగా కుదరకపోతే ఓంరౌత్ 'ఆదిపురుష్' తరహాలో వైఫల్యాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. పరాజయంతో పాటు విమర్శలు అంతే దారుణంగా ఉంటాయి. అయితే ఇప్పుడు యష్ రావణుడిగా నటిస్తుండగా, అతడి సరసన ఒక టీవీ నటిని ఎంపిక చేయడంపై అభిమానులు గుర్రుగా ఉన్నారు. సీనియర్ టీవీ నటి సాక్షి తన్వర్ ని రామాయణం దర్శకుడు నితీష్ తివారి ఎంపిక చేసుకున్నారు. రావణుడి భార్య మండోదరిగా సాక్షి నటించాల్సి ఉంది. కానీ ఈ ఎంపిక యష్ ఫ్యాన్స్ కు రుచించడం లేదు. ఫ్యాన్స్ డైరెక్టుగా దీనిపై సోషల్ మీడియాల్లో తమ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే అభిమానులు గ్రహించాల్సిన విషయాలు ఇక్కడ చాలా ఉంటాయి. సాక్షి స్థానంలో ఎవరైనా యువనటి లేదా గ్లామర్ ఎక్కువగా ఉన్న నటీమణిని ఎంపిక చేయడం సరైనదేనా? ముఖాభినయం, అద్భుత ఆహార్యంతో రక్తి కట్టించే సీనియర్ నటి ఆ పాత్రకు అవసరం. నితీష్ జీ ఆలోచన ఆ కోవలోనే సాగింది. అందుకే సాక్షి తన్వర్ లాంటి సీనియర్ బుల్లితెర నటిని ఎంపిక చేసుకున్నాడు. అయినా రామాయణంలో మండోదరి నటన కంటే రావణుడిగా యష్ నటన ఎలా ఉంటుంది? అన్నది చాలా కీలకం. మండోదరి పాత్ర చాలా పరిమితంగా ఇలా వచ్చి వెళ్లేదిగా ఉండొచ్చు. అందువల్ల అభిమానులు తమ అవివేకాన్ని ప్రదర్శించడం తగదని ఒక సెక్షన్ విశ్లేషిస్తోంది. సాక్షి తన్వర్ ఇప్పటికే ప్రీప్రిపరేషన్ వర్క్ లో బిజీగా ఉన్నారని తెలిసింది. ఆ స్టార్ హీరో మాటే నిజమైంది! ఆదిపురుష్ విషయంలో దర్శకుడు ఓంరౌత్ చేసిన తప్పిదాలను ఇప్పుడు పౌరాణిక, జానపద కథలు హిస్టారికల్ కథలు ఎంపిక చేసుకుని సినిమాలు తీసే దర్శకులు గుర్తు చేసుకుంటున్నారు. అలాంటి కథలను ఎంపిక చేసుకుంటే పాత్రధారులు మాట్లాడే భాష, కాస్ట్యూమ్స్, కాలాదులతో పాటు ఆర్టిస్టుల ఎంపికల విషయంలో రాజీకి రాకూడదు. నటీనటుల సీనియారిటీ కూడా కీలకం. అందువల్ల గ్లామర్ కోసం పాకులాట తగదనేది గమనార్హం. దర్శకుడు నితీష్ తివారీ సుదీర్ఘ అనుభవం ఉన్న దర్శకరచయితగా ప్రీప్రొడక్షన్ దశలో రామాయణం కోసం చాలా సమయం వెచ్చించి మంచి ఆర్టిస్టులను ఎంపిక చేసుకుంటున్నారు.

# నవీన్ పొలిశెట్టికి ప్రమాదం.. రెండు నెలలు విశ్రాంతి

యంగ్ హీరో నవీన్ పొలిశెట్టికి అమెరికాలో యాక్సిడెంట్ అయినట్టుగా తెలుస్తోంది. బైక్ మీద నుంచి పడిపోవడంతో చేతికి గాయాలు అయ్యాయట. దీంతో రెండు నెలలు విరామం తీసుకోవాలని వైద్యులు సూచించారట. ఇదేమీ షూటింగ్‌లో జరిగిన ప్రమాదం కాదని తెలుస్తోంది. యంగ్ హీరో నవీన్ పొలిశెట్టికి అమెరికాలో ప్రమాదం జరిగిందనే వార్త నెట్టింట్లో బాగా ట్రెండ్ అవుతోంది. షూటింగ్‌లో భాగంగా ఈ ప్రమాదం జరిగిందా? అని చాలా మంది అనుకుంటున్నారు. కానీ ఇదేమీ షూటింగ్‌లో భాగంగా జరిగినట్టుగా కనిపించడం లేదు. ఈ బైక్ ప్రమాదంలో నవీన్ చేతికి గాయాలయ్యాయట. చేతికి ఫ్యాక్చర్ అవ్వడంతో నవీన్ పొలిశెట్టి రెండు నెలలు విశ్రాంతి తీసుకోవాల్సి వస్తుందట. అంటే నవీన్ పొలిశెట్టి సినిమాలు మరింతగా ఆలస్యం అయ్యేలా ఉన్నాయి. నవీన్ పొలిశెట్టి థియేటర్లో నవ్వించి చాలా రోజులే అవుతోంది. చివరగా అనుష్క శెట్టితో కలిసి నవీన్ పొలిశెట్టి థియేటర్లోకి వచ్చాడు.మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మూవీ ఎంతో డీసెంట్‌గా ఉండటం, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి బ్గాగా నచ్చడంతో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. అటు అనుష్కకు, ఇటు నవీన్ పొలిశెట్టికి నటన పరంగానూ మంచి పేరు తెచ్చి పెట్టింది. జాతి రత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాలతో నవీన్ బాగానే క్రేజ్ దక్కించుకున్నాడు. నవీన్ పొలిశెట్టి ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగానే ఉన్నాడు. త్వరలోనే మూవీ అప్డేట్‌లు ఇస్తానంటూ నవీన్ వేసిన ట్వీట్ బాగానే వైరల్ అయింది. జాతి రత్నాలు 2 కూడా ఉంటుందన్నాడు. అయితే మంచి కంటెంట్ ఉన్న సినిమాలు ఇవ్వాలనే ప్రయత్నం చేస్తున్నానని, త్వరలోనే అందరినీ నవ్వించేందుకు థియేటర్లోకి వస్తాను అన్నట్టుగా చెప్పుకొచ్చాడు. కానీ ఇంతలోనే ఇలా బెడ్ రెస్ట్ తీసుకునే పరిస్థితికి నవీన్ పొలిశెట్టి వచ్చేశాడు.



# లాంచ్ అయి ఉంటుందిలే..



అల్లు అర్జున్ తాజాగా వేసిన ఇన్ స్టా స్టోరీ పోస్ట్, ట్వీట్ మీద చర్చలు జరుగుతున్నాయి. లాంచ్ అని చెప్పాల్సింది పోయి.. లంచ్ అని స్పెల్లింగ్ మిస్టేక్ వేశాడు. దీంతో నెట్టింట్లో క్షణాల్లో వైరల్ కాసాగింది. బన్నీ వేసిన ట్వీట్, పోస్ట్ మీద చర్చలు జరుగుతుండటంతో.. వెంటనే పొరబాటుని గమనించినట్టుగా ఉన్నారు. క్షణాల్లో ఆ ట్వీట్, ఇన్ స్టా స్టోరిని డిలీట్ చేసి మళ్లీ ఫ్రెష్‌గా స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా వేశారు. అసలు ఇంతకీ జరిగిన మ్యాటర్ ఏంటి? ఆ పోస్ట్‌లో ఉన్న సారాంశం ఏంటంటే.. దుబాయ్‌లోని మేడం టుస్సాడ్స్ మ్యూజియంలో బన్నీ మైనపు విగ్రహాన్ని త్వరలోనే లాంచ్ చేయబోతోన్నారట. ఈ విషయాన్ని బన్నీ తన ఇన్ స్టాగ్రాం స్టోరీ ద్వారా ప్రకటించేశాడు. ఈ క్రమంలోనే లాంచ్ అని చెప్పబోయి.. లంచ్ అని టైప్ చేసినట్టున్నాడు. ఇప్పుడు ఇదే విషయం మీద నెట్టింట్లో ట్రోలింగ్ జరుగుతోంది. బన్నీ మైనపు విగ్రహం కంటే.. ఈ తప్పు మీదే అందరి ఫోకస్ పడింది. బన్నీ పీఆర్ టీం అత్యుత్సాహం వల్లే ఈ తప్పు జరిగి ఉంటుందని నెటిజన్లు అంటున్నారు. కంగారులో ఏదో ఒక వేసేయాలని.. అలా లాంచ్‌కి బదులు లంచ్ అని వేసి ఉంటారని అంటున్నారు. నెటిజన్లు సైతం తమ్ముడు సినిమాలో అచ్యుత్ మాదిరి.. లంచ్ ఆ??. లాంచ్ అయి ఉంటుందిలే అని చదువుకుని నవ్వేసుకుంటున్నారు. ఆ స్పెల్లింగ్ మిస్టేక్‌ను మాత్రం వెంటనే కరెక్ట్ చేసింది బన్నీ టీం. వెంటనే కొత్త పోస్ట్ వేశారు. ట్విట్టర్‌లో ట్వీట్ డిలీట్ చేసి మళ్లీ కొత్తగా వేశారు. లండన్ మ్యూజియంలో ఆల్రెడీ ప్రభాస్, మహేష్ బాబు మైనపు విగ్రహాల్ని పెట్టారన్న సంగతి తెలిసిందే. దుబాయ్‌లో మాత్రం బన్నీదే మొదటి మైనపు విగ్రహం కావడం విశేషం.

# అప్పుడే మీకు అర్థం అవుతుంది..



రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టాలీవుడ్ సెలెబ్రిటీలు సందడి చేశారు. ఈ ఈవెంట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ గేమ్ చేంజర్ అప్డేట్లు ఇచ్చాడు. ఈ క్రమంలో లేట్ అవుతోందని తనను తిట్టుకోవద్దని చెప్పుకొచ్చాడు. రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా బుధవారం నాడు శిల్పా కళా వేదికలో గ్రాండ్‌గా ఈవెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దిల్ రాజు, మంచు మనోజ్ వంటి వారు స్పెషల్ గెస్టులుగా వచ్చారు. ఈ వేడుకలో దిల్ రాజు మాట్లాడుతూ గేమ్ చేంజర్ అప్డేట్లను ఇచ్చారు. అప్డేట్లు ఆలస్యం అవుతోందంటూ తనను తిట్టుకోకండని, కాస్త ఓపికతో ఉండండని సినిమాను శంకర్ అద్భుతంగా తీస్తున్నాడంటూ దిల్ రాజు చెప్పుకొచ్చాడు. గ్లోబల్ స్థాయికి ఎదిగిన రామ్ చరణ్ గేమ్ చేంజర్ సినిమా కూడా అదే స్థాయిలో ఉంటుందని చెప్పుకొచ్చాడు. ఆర్ఆర్ఆర్ సినిమా తరువాత వస్తోంది కాబట్టి.. ఆ రేంజ్‌లో సినిమా రావాలి.. అందుకే శంకర్ ప్రతీ సీన్, ప్రతీ సాంగ్‌ను చెక్కుతున్నాడు అని దిల్ రాజు చెప్పుకొచ్చాడు. మీరు జరగండి పాటలో చూసింది కేవలం రెండు శాతమే.. ఇంకా చాలా ఉందని.. సినిమా చూస్తే మీకే అర్థం అవుతుందని హైప్ పెంచేశాడు దిల్ రాజు. అప్డేట్ల కోసం మీరు నన్ను తిడుతున్నారని, కొన్ని కామెంట్లు మా టీం చూపిస్తుంది.. అరేయ్ దిల్ మామా అప్డేట్లు ఇవ్వు అని అంటుంటారని చూశా. కానీ అప్డేట్లు నేను ఇవ్వలేను.. పై నుంచి రావాలి.. కాస్త ఓపిక పట్టండి.. నన్ను తిట్టుకోకండి.. త్వరలోనే షూటింగ్ అవుతుంది.. నాలుగైదు నెలల్లోనే సినిమాను రిలీజ్ చేస్తామంటూ దిల్ రాజు అన్ని విషయాలను చెప్పుకొచ్చాడు. నేను ఈ సినిమా విషయంలో ఎలాంటి లీకులు ఇవ్వలేను. నాలుగైదు నెలల్లోనే సినిమా వస్తుంది. ఈ ఏడాది బర్త్ డే రామ్ చరణ్‌కు ఎంతో స్పెషల్.. అతని జీవితంలోకి క్లీంకార వచ్చింది.. నేటి ఉదయమే తిరుమలకు వెళ్లి దర్శనం చేసుకుని వచ్చాడు.. గేమ్ చేంజర్ పాట మాస్‌లోకి బాగా వెళ్ళింది.. ఇంకో మూడు రోజులు ఆగితే..ఆ పాట గురించి ప్రతీ ఒక్కరూ మాట్లాడుకుంటారు.. ఎందుకంటే ఆ సాంగ్ లీకైంది కాబట్టి అలానే అనిపిస్తుంది.. లిరికల్ వీడియోలో విజువల్ ట్రీట్‌తో అంతగా సంతృప్తి చేయలేం.. కానీ థియేటర్లో ఈ పాట పడితే మాత్రం సీట్లలో కూర్చోలేరు అది మాత్రం గ్యారెంటీ అని దిల్ రాజు చెప్పుకొచ్చాడు.

# వదిలి ఉండలేకపోయిన నయనతార?



విఘ్నేశ్ శివన్ ఏదో షూటింగ్ నిమిత్తం అలా 20 రోజులు బయటకు వెళ్లినట్టుగా ఉన్నాడు. అయితే ఈ ఇరవై రోజులు పిల్లలను నయనతారే చూసుకున్నట్టుగా ఉంది. పని ముగించుకుని విఘ్నేశ్ శివన్ రావడంతో పిల్లలతో పాటు నయనతార ఎగిరి గంతేసినట్టు ఉంది. నయనతార ప్రస్తుతం ఫ్యామిలీకి ఎక్కువగా టైం కేటాయిస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఇక విఘ్నేశ్ శివన్ తన సినిమా షూటింగ్ కోసం 20 రోజులు బయటకు వెళ్తే.. పిల్లలతో పాటు నయన్ ఉన్నట్టుగా తెలుస్తోంది. పిల్లలు తమ తండ్రిని 20 రోజులు చూడకుండా ఒక్కసారిగా చూస్తే ఎలా అవుతారో.. నయన్ కూడా అలానే ఎగిరి గంతేసినట్టుగా కనిపిస్తోంది. ఇరవై రోజులు అలా ఓ షెడ్యూల్ కోసం బయటకు వెళ్లినప్పుడు నిన్ను ఎంతగానో మిస్ అయ్యాం.. నిన్ను ఇలా చూడటంతో మేం ముగ్గురం ఎంతో ఆనందంగా ఉన్నామంటూ నయన్ తన పిల్లలు, భర్తతో ఉన్న ఫోటోలను షేర్ చేసింది. అంటే భర్తను అలా వదిలి నయన్ ఉండలేకపోతోందని తెలుస్తోంది. ఇక పిల్లలు సైతం తండ్రి కోసం బాగానే అల్లరి చేసినట్టు అర్థం అవుతోంది. మొత్తానికి నయన్ మాత్రం ఇప్పుడు ఫ్యామిలీ లైఫ్‌ను బాగానే ఎంజాయ్ చేస్తోంది. భర్త, పిల్లల ప్రేమతో నయన్ ఎంతో సంతోషంగా ఉందని కనిపిస్తోంది. ఇక ఇప్పుడు నయన్ సైతం సినిమాల కంటే ఫ్యామిలీకే ఎక్కువగా టైం కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. నయన్ ప్రస్తుతం ఎటువంటి కాంట్రవర్సీలను తన నెత్తి మీద వేసుకోవాలని అనుకోవడం లేదు. అందుకే అన్నపూరని మూవీ టైంలో వచ్చిన వివాదానికి వెంటనే ముగింపు పలికింది. తనకు దేవుడంటే నమ్మకమని, పుణ్యక్షేత్రాలు సందర్శిస్తుంటానని, తాను ఎవ్వరి మనోభావాలను దెబ్బ తీయాలని అనుకోవడం లేదని అన్నపూరణి కాంట్రవర్సీ సన్నివేశాల మీద క్లారిటీ ఇచ్చింది. ఎవరి మనోభావాలైనా దెబ్బ తిని ఉంటే క్షమించండి అంటూ నయన్ కోరింది. నయనతార చివరగా చిరంజీవి గాడ్ ఫాదర్ సినిమాలో కనిపించింది. అందులో చిరుకి చెల్లిగా నయన్ నటించింది.

# వారియర్ అంటోన్న రేణూ దేశాయ్

అకిరా నందన్ ప్రస్తుతం తనకు నచ్చినట్టుగా ఉంటున్నాడు. మ్యూజిక్ ఇష్టం కాబట్టి.. మ్యూజిక్ క్లాసులకు వెళ్తున్నాడు. బాస్కెట్ బాల్ ఇష్టం కాబట్టి.. వీలుచిక్కినప్పుడల్లా ఆడేస్తుంటాడు. ఇక సమయం సందర్భాన్ని బట్టి అకిరా నందన్ పియానో వాయించేస్తుంటాడు. సంక్రాంతి సెలెబ్రేషన్స్‌లో భాగంగా అకిరా నందన్ వాయించిన పాటకు అందరూ ఫిదా అయ్యారు. పవన్ కళ్యాణ్ మీదున్న ప్రేమను అలా పాట రూపంలో చూపించేశాడని అంతా సంబరపడిపోయారు. అలా అకిరా నందన్ చర్యలు ఊహాతీతంగా ఉంటాయి. పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఏమో అకిరా ఎంట్రీ కోసం చూస్తున్నారు. అకిరా మాత్రం ఎప్పుడూ కూడా సినిమా ఎంట్రీ మీద ఫోకస్ పెట్టినట్టుగా అనిపించదు. కనిపించదు.

రేణూ దేశాయ్ సైతం అకిరా నందన్ ఎంట్రీ మీద నర్మగర్భంగా స్పందిస్తూ ఉంటారు. అకిరాకు ఇప్పుడు ఇంట్రెస్ట్ లేదని, ఒక వేళ అకిరా సినిమాల్లోకి వస్తే మాత్రం ఆ ప్రకటన తానే ముందుగా చేస్తానని చెబుతుంటుంది. అకిరా ప్రస్తుతం ఎలాంటి మూడ్‌లో ఉన్నాడో చూపించేలా ఓ హింట్ ఇస్తూ వీడియోను వదిలింది. ఇందులో అకిరాను చూస్తుంటే నిజంగానే ఓ యోధుడిలా ఉన్నాడు.

ఓ వైపు ఆధ్యాత్మికంగా కనిపిస్తూనే.. మరో వైపు ఏదో సీరియస్‌గా కసరత్తులు చేసినట్టుగా అనిపిస్తోంది. అలా సూర్యాస్తమయంలో ఆ డ్రెస్సులో అకిరా కనిపిస్తుండటంతో.. అసలు అకిరా ఏం చేస్తున్నాడు.. ఏం ప్రాక్టీస్ చేస్తున్నాడనే ఆలోచనలు అభిమానులు సహజంగానే పుట్టుకొస్తాయి. కానీ రేణూ దేశాయ్ మాత్రం తన కామెంట్ సెక్షన్‌ను క్లోజ్ చేయడంతో ఆమెను అడిగేందుకు ఆస్కారం లేకుండా పోయింది. మై వారియర్ సన్ అంటూ అకిరా గురించి రేణూ దేశాయ్ షేర్ చేసిన ఈ వీడియో మాత్రం అభిమానుల్ని ఆకట్టుకుంటోంది. మరి అకిరా ఎంట్రీ ఎప్పుడెప్పుడు ఉంటుందా? అంటూ అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

# మోహన్ బాబు చిరంజీవిల మధ్య గొడవ..



రామ్ చరణ్ గురించి మంచు మనోజ్ మాట్లాడిన మాటలు, ఇచ్చిన ఎలివేషన్స్, మంచు మెగా ఫ్యామిలీ మధ్య ఉండే వైరం గురించి చెప్పిన మాటలు, చివర్లో వేసిన డైలాగ్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇంతకీ మనోజ్ తన స్పీచులో చెప్పిన అంశాలు, విషయాలు ఏంటో ఓ సారి చూద్దాం. రామ్ చరణ్ నాకు ప్రాణ మిత్రుడు.. అలాంటి రామ్ చరణ్ బర్త్ డే ఈవెంట్‌కు ఇలా రావడం ఆనందంగా ఉంది. ప్రతీ ఏడాది అభిమానులు ఎంతో గ్రాండ్‌గా సెలెబ్రేషన్స్ చేస్తారు.. రామ్ చరణ్ చిన్నతనం నుంచీ తనతో ఉన్న స్నేహితులతో ఇప్పటికీ అలానే ఉన్నారు.. ఈ కాలంలో స్నేహం దొరకడం చాలా కష్టం.. అందరూ స్థాయి పెరిగాక కొత్త స్నేహాలతో బిజీగా ఉంటారు.. పాత వారిని మరిచిపోతారు.. కానీ రామ్ చరణ్ మాత్రం ఇంకా తన చిన్న నాటి స్నేహితులతోనూ అలానే ఉంటాడు.. మేం చెన్నైలో అంతా కూడా పక్కపక్కనే ఉండేవాళ్లం. రామ్ చరణ్‌కు పక్కన వారికి సాయం చేయడం అంటే ఇష్టం. ఎవరు ఏ కష్టాల్లో ఉన్నా సాయం చేస్తుంటాడు.. అదే రామ్ చరణ్ గ్రేట్ నెస్. ఓ సారి ఓ కుటుంబం దుబాయ్‌లో చిక్కుకుంది. ఓ ఆడబిడ్డ కుటుంబం కష్టాల్లో ఉందని తెలిసింది. నా వంతుగా నేను సాయం చేశాను.. నాకు ఇంకా డబ్బు కావాల్సి వచ్చింది.. ఆ అర్ధరాత్రి ఎవరికి ఫోన్ చేయాలా? అనుకున్నా.. అలా అర్ధరాత్రి రామ్ చరణ్‌కు ఫోన్ చేసి ఐదు లక్షలు అడిగాను.. బాబాయ్ ఇలా ఓ ఆడబిడ్డకు కష్టం ఉందని చెప్పా.. వెంటనే ఐదు లక్షలు కొట్టేశాడు.. అదీ రామ్ చరణ్ గొప్పదనం. చిరంజీవి గారు మోహన్ బాబు గారు అలా గొడవలు పెట్టుకుంటారు.. మరి వారి పిల్లలైన మీరు మాత్రం ఇంత కాలం స్నేహితులుగా ఎలా ఉన్నారు అని అంతా అడుగుతుంటారు.. భార్యాభర్తల గొడవల్లోకి మధ్యలోకి వెళ్తే ఏం అవుతుంది.. అలానే వారిద్దరి మధ్యలోకి కూడా వెళ్లొద్దు.. వారిద్దరూ కూడా అలాంటి వారే.. టామ్ అండ్ జెర్రీ టైపు.. వాళ్లది 45 ఏళ్ల బంధం.. రిలేషన్ షిప్ బెట్వీన్ మంచు ఫ్యామిలీ అండ్ మెగా ఫ్యామిలీ షుడ్ బీ లైక్ ఫిష్ అండ్ వాటర్.. బట్ నాట్ ఫిష్ అండ్ ఫిషర్ మెన్ అని డైలాగ్ చెప్పి ముగించాడు.